

ఏజెన్సీలో కల్తీ కల్లు.. దందా

- జిల్లాలోని ఉట్నూర్ ఏజెన్సీలో జోరుగా నాటుసారా, కల్తీ కల్లు విక్రయాలు
- ఇప్పపువ్వు సారా అంటూ డబ్బులు దండుకుంటున్న వైనం
- కల్తీ పదార్థాలతో ఇబ్బడిముబ్బడిగా నాటు సారా తయారీ
- ఆరోగ్యం గుల్ల చేసుకుంటున్న యువకులు, వృద్ధులు
- రోజురోజుకూ ఆగమాగం అవుతున్న ఆదివాసీ గిరిజన గూడాలు
- బెల్ట్‌షాపుల్లోనూ అధిక ధరలకు మద్యం విక్రయాలు
- చోద్యం చూస్తున్న అధికారులు
- జిల్లావ్యాప్తంగా గిరిజన ప్రాంతాలలో ఎలాంటి అనుమతులు లేకపోయినా జోరుగా కల్లు విక్రయాలు

ఉట్నూర్, మార్చి 24: జిల్లాలోని ఉట్నూర్ ఏజెన్సీలో జోరుగా నాటుసారా కల్తీ కల్లు విక్రయాలు జరుగుతున్న నిరోధించాల్సిన ఎక్సైజ్ పోలీసులు చోద్యం చూస్తున్నారు. ఉమ్మడి జిల్లాలోని ఏజెన్సీ ఏరియాలో నాటు తయారీని అడ్డుకోవడంలో విఫలమవుతున్న అధికారులు కల్తీ కల్లు నిరోదించడంలో కూడా నిమ్మకుండి పోతున్నారు. ఫలితంగా ఏజెన్సీ ప్రాంతాలలోని గిరిజన గూడాలు తాగుబోతుల చర్యలతో ఆగమాగం అవుతున్నాయి. ఇప్పపువ్వ సారా అంటూ కల్తీసారా తయారు చేస్తూ డబ్బులు దండుకుంటున్నారు.

కల్తీ వస్తువులతో నాటుసారా

కల్తీ వస్తువులతో గుడుంబా తయారు చేసే వారు ప్రస్తుతం నాటుసారాను కూడా తయారు చేస్తున్నారు. బెల్లం, పట్టిక, మురిగిన టమటాలు, కుళ్లిపోయిన కూరగాయలతో పాటు విష పూరితమైన చెట్ల బెరడులు, యూరియా లాంటివి ముడి సరుకులుగా ఉపయోగించి గుడుంబా తయారు చేస్తున్నారు. దీంతో నాటుసారా ప్రియుల జీవితాలతో చెలగాటం ఆడుతూ డబ్బు సంపాదిస్తున్నారు. ఉట్నూర్, ఇంద్రవెల్లి, నార్నూర్, జైనూర్, సిర్పూర్(యు), లింగాపూర్‌తో పాటు ఆయా మండలాల్లోని పలు గ్రామాలలో జోరుగా నాటుసారా తయారు చేస్తూ విక్రయిస్తున్నారు. నాటుసారా తాగడానికి అలవాటు పడ్డ యువకులు, వృద్ధులు తాగి ఆరోగ్యం గుల్ల చేసుకుంటున్నారు. ఉట్నూర్ మండలంలోని చెక్‌పోస్టు కొత్తగూడ, దంతంపల్లి, ఇన్కర్‌గూడ, పెరుకగూడ, లక్కారం, గంగన్నపేట, నవోదయనగర్, ఎన్టీఆర్‌నగర్, శాంతినగర్, కొమ్ముగూడ, గంగాపూర్, షాంపూర్, వడోని, ఏందా, పులిమడుగు, ఇంద్రవెల్లి, ధనోరా, నార్నూర్, భీంపూర్, కొత్తపల్లి, మహాగావ్, మల్లంగి, మాలేపూర్, సుంగాపూర్, నాగోల్కొండ, తదితర ప్రాంతాలలో నాటుసారా విక్రయాలు జోరుగా సాగుతున్నాయి. అంతేకాకుండా ఎక్సైజ్ అధికారులు దాడులు జరిపి కొందరి పై కేసులు నమోదు చేస్తున్నప్పటికీ.. నాటుసారా తయారీదారులు కేసులు తమకు కొత్త కాదని దులిపేసుకోవడం గమనార్హం.

కల్తీకల్లు విక్రయాల జోరు

గిరిజన ప్రాంతాలలో కల్లు విక్రయాలకు అనుమతి లేకపోయినప్పటికీ కొందరు కులవృత్తిని నమ్ముకొని జీవిస్తున్న వారు కల్తీకల్లు తయారు చేసి జోరుగా విక్రయిస్తున్నారు. ఏజెన్సీ ప్రాంతంలో కల్లుగీత వృత్తి కేవలం గిరిజనులు మాత్రమే చేయాలని ప్రభుత్వ ఆదేశాలు ఉన్నప్పటికీ లైసెన్సులను కూడా ప్రభుత్వం గిరిజనులకే కేటాయిస్తూ వస్తుంది. కానీ కొంత మంది కల్తీ కల్లు తయారు చేసి ఈ కల్లులో క్లోరోఫామ్, షాక్రిన్, తదితర నిషా వస్తువులు చేర్చి తయారు చేస్తూ ప్రజల జీవితాలతో ఆడుకుంటున్నారు. ఒక్కసారి ఈ కల్లు తాగిన వారు మళ్లీ మళ్లీ తాగుతూ నిషా మత్తులో ఊగిపోతున్నారు. ఏజెన్సీ ఏరియాలో తాటిచెట్లు, ఈత చెట్లు అంతంత మాత్రమే ఉన్నప్పటికీ వ్యాపారులు మాత్రం తాటికల్లు, ఈతకల్లు అమ్ముతున్నామంటూ బహిరంగంగానే విక్రయిస్తున్నారు. నాటుసారా కల్తీకల్లు తాగుతూ ఇప్పటికే ఉట్నూర్ ఏజెన్సీలో పదుల సంఖ్యలో మంది మృతి చెందారని, అయినా సంబంధిత శాఖ అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని ఏజెన్సీ ప్రజలు వాపోతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు జోక్యం చేసుకొని నాటుసారా, కల్తీకల్లు తయారీదారులకు అడ్డుకట్ట వేయాలని ఏజెన్సీ ప్రాంతాల్లోని ప్రజలు కోరుతున్నారు.


● హర్కాపూర్ వద్ద సీసాల్లో విక్రయిస్తున్న కల్లు (ఇన్‌సెట్‌లో నాటుసారా తాగి రోడ్డు మీద పడిపోయిన వ్యక్తి

బెల్ట్‌షాపుల్లో అధిక ధరలు

ఉట్నూర్ ఏజెన్సీలో వైన్స్‌షాపుల యజమానుల కనుసన్నలలో గ్రామ గ్రామాన బెల్ట్‌షాపులు కొనసాగుతున్నాయి. ప్రతీ గ్రామంలో ఏర్పాటు చేసిన బెల్ట్‌షాపులలో అధిక ధరలకు మద్యం విక్రయాలు జరుగుతుండడంతో గ్రామీణ ప్రాంతాల ప్రజలు మద్యంకు బదులుగా నాటుసారా, కల్తీకల్లుకు అలవాటు పడుతున్నారు. ఇది అదునుగా మద్యం షాపుల యజమానులు బెల్ట్‌షాపుల వారికి అధిక ధరలకు మద్యం విక్రయిస్తుండడంతో.. బెల్ట్‌షాపుల వారు మరింత అదనపు ధరలతో గ్రామీణ ప్రాంతాలలో మద్యం అమ్ముతున్నారని మందుబాబులు పేర్కొంటున్నారు. అయితే, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే బెల్ట్‌షాపులను మూసివేస్తామని ప్రకటించినప్పటికీ యధావిధిగా బెల్ట్‌షాపులు కొనసాగుతున్నాయి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు ఈ విషయమై జోక్యం చేసుకోవాలని, ఏజెన్సీలోని గిరిజన ప్రాంతాల్లో గల పలు ఆదివాసీ గిరిజన గ్రామాల్లోని బెల్ట్‌షాపులను నిరోధించాలని గ్రామీణ ప్రాంతాల ప్రజలు కోరుతున్నారు.



నాటుసారా, కల్తీ కల్లు విక్రయాలను అడ్డుకోవాలి

: పుర్క బాపురావు, తుడుందెబ్బ జిల్లా అధ్యక్షుడు



ఏజెన్సీ ప్రాంతంలో కల్లు విక్రయాలపై నిషేదం ఉన్నప్పటికీ.. ఎక్సైజ్ అధికారులు చూసీ చూడనట్లుగా ఉంటున్నారు. మామూళ్ల మత్తులో అలవాటు పడి అధికారులు కల్తీకల్లు విక్రయాలను చూసీచూడనట్లుగా వ్యవహరిస్తున్నడంతో కల్తీ కల్లు తాగి అమాయక గిరిజనులు మరణిస్తున్నారు.

గుడుంబాను నియంత్రిస్తున్నాం

: మురళీకృష్ణ, ఇన్‌చార్జ్ సీఐ, ఎక్సైజ్ అండ్ ప్రొహిబేషన్, ఉట్నూర్



ఏజెన్సీలోని గిరిజన గ్రామాలలో నాటుసారా తయారీని అడ్డుకుంటున్నాం. ఉన్నతాధికారుల ఆదేశాలు, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారుల సహకారంతో గుడుంబా స్థావరాలపై దాడులు నిర్వహిస్తున్నాం. ఈ మాసంలో ఇప్పటి వరకు పదిమంది పై కేసులు నమోదు చేసి రిమాండ్ చేశాం.

హోలీ పండుగను ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకోవాలి : ఎస్పీ



ఆదిలాబాద్ అర్బన్, మార్చి 24: జిల్లా ప్రజలందరు పండుగను ప్రశాంత వాతావరణంలో సాంప్రదాయాల నడుమ, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా నిర్వహించుకోవాలని జిల్లా ఎస్పీ గౌస్‌ఆలం సూచించారు. హోలీ పండుగ సందర్భంగా జిల్లా ప్రజలకు పోలీసు వ్యవస్థ తరఫున శుభాకాంక్షలు తెలిపారు. ముఖ్యంగా యువతర మద్యం సేవించి వాహనాలను నడపడం చట్టరీత్యా నేరమన్నారు. జిల్లా ప్రజలు సురక్షితమైన రంగులను వాడి పండుగను నిర్వహించుకోవాలని సూచించారు. యువత హోలీ పండుగ అనంతరం చెరువులో, లోతట్టు ప్రాంతాల్లో స్నానాలు ఆచరించే క్రమంలో జాగ్రత్తలు పాటించడం తప్పని సరి అని సూచించారు. ముఖ్యంగా యువత తల్లిదండ్రులు పిల్లల కార్యక్రమాలను గమనిస్తూ వారికి సరైన పద్ధతిని తెలియజేయాలని సూచించారు. వాహనాలు నడిపే క్రమంలో అతివేగం, రేష్ డ్రైవింగ్, ట్రిపుల్ డ్రైవింగ్ లాంటి కార్యక్రమాలను యువత మానుకోవాలని సూచించారు.

ప్రజలు నిర్భయంగా ఓటువేయాలి : డీఎస్పీ

గుడిహత్నూర్, మార్చి 24: పార్లమెంట్‌ఎన్నికల సందర్భంగా ప్రజలు ఎవరి ప్రలోభాలకు గోంగకుండా నిర్భయంగా ఓటువేయాలని ఉట్నూర్ డీఎస్పీ నాగేందర్ అన్నారు. ఆదివారం సాయంత్రం మండల కేంద్రంలో స్థానిక పోలీసులు కేంద్ర బలగాలతో కవాతు నిర్వహించారు. ఈసందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ పార్లమెంట్ ఎన్నికలకు పకడ్బందీగా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ప్రజలు ప్రశాంత వాతావరణంలో ఓటు వేసేందుకు కవాతు నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఇచ్చోడ సీఐ భీమేష్, ఏఎస్ఐ బలిరం, కేంద్ర బలగాల కమాండెట్ సాహూ, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి పనుల పరిశీలన

తాంసి, మార్చి 24: ఉపాధి పనులను ఆదివారం సీపీఐ జిల్లా నాయకులు పరిశీలించారు. మండలంలోని గోట్కూరి గ్రామంలో గత కొద్ది రోజుల నుంచి ఉపాధి పనులు జరగడం లేదు. ఈ విషయమై సీపీఐ జిల్లా నాయకుడు చిలుక దేవిదాస్ జిల్లా కలెక్టర్, ఇతర అధికారులకు వినతిపత్రం అందజేశారు. దీనికి స్పందించిన జిల్లా అధికార యంత్రాంగం గోటుకూరిలో ఉపాధి పనులను ప్రారంభించింది. ఈ పనులు ఎలా జరుగుతున్నాయో? అని నాయకులు ఆదివారం ఉపాధి పనులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ చిలుకాదేవిదాస్, రమేష్, అశోక్, తదితరులు ఉన్నారు.

జిల్లాలో ఘనంగా కామదహనం

● గ్రామాల్లోని ప్రధాన కూడళ్లల్లో కాముడికి ప్రత్యేక పూజలు ● మార్కెట్‌లో రంగుల సందడి ● నేడే రంగుల పండుగ


తాంసిలో కామదహనం నిర్వహిస్తున్న గ్రామపెద్దలు


సిరికొండలో కామదహనంలో పాల్గొన్న గ్రామస్థులు

ఆదిలాబాద్ అర్బన్, మార్చి 24: ప్రకృతి అందాలకు కొత్త అందం తీసుకొచ్చే వసంత రుతువు ప్రవేశించిన తర్వాత జరుపుకునే తొలి పండుగ హోలీ. చిన్నపెద్ద ఊరువాడ ఏకమై రంగుల్లో తడిసి ముద్దయ్యేందుకు ప్రజలు సిద్ధమయ్యారు. ఎప్పుడెప్పుడని ఎదురు చూసిన హోలీ పండుగ రానే వచ్చింది. రంగుల హోలీని ఆనందంగా జరుపుకునేందుకు సిద్ధమవుతున్నారు. మార్కెట్‌లో రంగులు సందడి చేస్తున్నాయి. పట్టణంలోని ప్రధాన కూడళిలో రంగుల విక్రయాల కోసం వ్యాపారులు ప్రత్యేక దుకాణాన్ని ఏర్పాటు చేశారు. ప్రకృతి ప్రేమికులు సహజ సిద్ధమైన రంగులను తయారు చేసుకుంటున్నారు. యువత మాత్రం పండుగను జరుపుకునేందుకు రంగులను సమకూర్చుకుంటున్నారు. అంబేద్కర్‌చౌక్, గాంధీచౌక్ కూడళ్లలో రంగుల దుకాణాలను ఏర్పాటు చేశారు. రంగులను చల్లుకునేందుకు చిన్న పిల్లల కోసం వివిధ రకాల డిజైన్లలో రంగు డబ్బాలను తయారు చేశారు. సాంప్రదాయబద్ధంగా వస్తున్న చక్కెరపేర్లు, కుడుకల దండకాల అమ్మకాలు జోరుగా సాగుతున్నాయి. ఆదివారం రాత్రి జిల్లా వ్యాప్తంగా కామదహనం చేసి కాముడికి ప్రత్యేకపూజలు నిర్వహించారు. ప్రధానంగా గోపాలకృష్ణ మఠం, మార్వాడి ధర్మశాల, తాటిగూడ, భాగ్యనగర్, రవీంద్రనగర్, కైలాస్‌నగర్ కాలనీలలో ఘనంగా కామదహనం నిర్వహించారు.

తాంసి: మండలకేంద్రంతో పాటు మండలంలోని దేవాపూర్, జనిబరంపూర్, సుంకిడి, కొచ్చిలాపూర్, తదితర గ్రామాల్లో ఆదివారం కామదహన వేడుకలను స్థానికులు ఘనంగా జరుపుకున్నారు. అనంతరం ఒకరికొకరు హోలీ పండుగ శుభాకాంక్షలను తెలుపుకున్నారు. ఇందులో దేవాలయ కమిటీ అధ్యక్షుడు తిరుపతిరెడ్డి, ఉపాధ్యక్షుడు శ్రీకాంత్, సభ్యులు నల్ల పద్మక్క, మాజీ ఉపసర్పంచ్ సత్యపాల్, ఆసం రవి, రవి, వెంకన్న, గ్రామపెద్దలు, తదితరులు పాల్గొన్నారు.

సిరికొండ రూరల్: మండలంలో ఆదివారం రాత్రి కామదహన కార్యక్రమాన్ని ఘనంగా జరుపుకున్నారు. కాగా సోమవారం హోలీ పండుగను పురస్కరించుకుని ఒక రోజు ముందు ప్రత్యేక పూజలు చేసి, కామదహన వేడుకలను గ్రామ పటేల్‌ల ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సునీల్ పటేల్, దత్తురామ్, నర్సయ్య, నర్సింలు, భూమన్న, ఎగ్గిడి నడిపి, గోవింద్‌రావ్, ఆయా గ్రామాల పటేల్‌లు, గ్రామపెద్దలు, యువకులు, తదితరులు పాల్గొన్నారు.


ఉట్నూర్ సంతలో రంగులు అమ్ముతున్న దృశ్యం

ఉట్నూర్‌లో వెలసిన రంగుల దుకాణాలు

ఉట్నూర్, మార్చి 24: మండల కేంద్రంలో ప్రతీ ఆదివారం జరిగే వార సంతలో హోలీ సంబరాల కోసం వ్యాపారులు రంగుల దుకాణాలను తెరిచారు. రాక్షసుల ముఖాల ప్లాస్టిక్ బొమ్మలు, ఇలలు, రంగులు చల్లే ప్లాస్టిక్ పరికరాలతో పాటు వివిధ రరకాల రంగులు అమ్మకానికి పెట్టడంతో మండలంలోని వివిధ గ్రామాల నుంచి వచ్చే ప్రజలు తమకు కావాల్సిన రంగులతో పాటు చక్కరపేర్లు కొనుగోలు చేసుకున్నారు. ఆదివారం రాత్రి కామదహనం నిర్వహించి సోమవారం రంగుల కేలి నిర్వహించడానికి ప్వరజలు ఏర్పాట్లు పూర్తి చేసుకున్నారు. ఇదిలా ఉండగా ఆదివాసీ గిరిజన గూడాలలో గిరిజనులు తమ ఆచార సంస్కృతి ద్వారా కామదహనం నిర్వహించారు. ఆయా ప్రాంతాలలో ఉన్న ఉద్యోగుల సైతం హోలీ పండుగకు తమ గ్రామాలకు చేరుకోవడం గిరిజనుల సంస్కృతి. గిరిజన గ్రామంలోని గిరిజనులందరు కుడుకులు, చక్కెరపేర్లు ఒక వద్ద సేకరించి వెదురు బొంగులతో మాతరి మాతలను తయారు చేసి గిరిజన వాయిద్యాలు చప్పులతో గ్రామ పొలిమెరలో గిరిజనులు అందరు కలిసి కామదహనం నిర్వహించడం ఆదివాసీల ఆచారం. మరుసటి రోజు ఉదయం నుంచి గిరిజన గ్రామాలలో హోలీ వేడుకలు నిర్వహించుకుంటారు.


మాట్లాడుతున్న డీడీ దిలీప్‌కుమార్

జాతీయ స్థాయి పోటీల్లో రాణించాలి

ఉట్నూర్, మార్చి 24: దేశ రాజధాని న్యూఢిల్లీలో జరుగనున్న జాతీయ స్థాయి పురుషుల ఖోఖో పోటీలలో గెలుపొంది తెలంగాణ రాష్ట్రం పేరు నిలబెట్టాలని జిల్లా గిరిజన సంక్షే మ శాఖ డిప్యూటీ డైరెక్టర్ దిలీ ప్‌కుమార్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని కొమురం భీం క్రీడా మైదానంలో గత పది రోజులుగా నిర్వహిస్తున్న ఖోఖో క్రీడా శిబిరం ముగింపు కార్యక్రమంలో క్రీడాకారులను ఉద్దేశించి ఆయన మాట్లాడారు. సీనియర్ ఖోఖో క్రీడాకారులతో ఆదర్శ క్రీడా పాఠశాలల విద్యార్థులు ఆడడం వల్ల గిరిజన విద్యార్థులు మరిన్ని మెళకువలు నేర్చుకునే అవకాశం లభించింది అన్నారు. ఇందులో జిల్లా గిరిజన సంక్షేమ గిరిజన అధికారి పార్థసారథి, ఏటీడీవో క్రాంతికుమార్, ఫిజికల్ డైరెక్టర్ జాదవ్ హేమంత్‌నాయక్, తదితరులు పాల్గొన్నారు.

రంజాన్ వేళలు

సోమవారం	మంగళవారం
ఇఫ్తార్ సా.6.34	సహర్ ఉ.4.54



ఇతరుల పట్ల మీకున్న ద్వేషానికి లోనై మీరు న్యాయాన్ని త్యజించకండి. న్యాయమే చేయండి. అది దైవభీతికి సమీపమైనది.

ఆదివాసీ గిరిజన గ్రామాల్లో హోలీ పండుగ


ఇంద్రవెల్లిలో కుడకలు, చక్కెర బిళ్లల పేర్ల విక్రయాలు ఇలా..


కామదహనం నిర్వహిస్తున్న ఆదివాసీ గిరిజనులు

ఇంద్రవెల్లి, మార్చి 24: మండలంలోని ఆదివాసీ గిరిజన గ్రామాల్లో హోలీ పండుగను పురస్కరించుకుని గిరిజన సంప్రదాయం ప్రకారం కాముడి దహనం చేశారు. ఆదివారం సాయంత్రం కామున్ని దహనం చేసి.. హోలీ పండుగకు శ్రీకారం చుట్టారు. గిరిజన గ్రామంలో ప్రతి కుటుంబానికి చెందిన వారు తమ సంస్కృతీ, సంప్రదాయం ప్రకారం కుడుకలు, చక్కెర బిళ్లల పేర్లను తీసుకుని గ్రామ పటేల్ ఇంటికి చేరుకున్నారు. పటేల్ ఇంటి ముందర కొంత మంది గిరిజన పెద్దలు కుడుకలు, చక్కెర బిల్లల హారాలను సేకరించారు. మరికొందరు కామ దేవతను వెదురు కర్రలతో మాతరి, మాతారను తయారు చేశారు. గ్రామ పొలిమేరలో కామదహనం అనంతరం వాయిద్యాలు వాయిస్తూ గిరి జన సంప్రదాయ నృత్యాలు చేశారు. ఇందులో సమక గ్రామ పటేల్ పెందూర్ భగవంత్‌రావు, మహారాజ్ యశ్వంత్‌రావు, గ్రామస్థులున్నారు.

● **ఎమ్మెల్యే ఇంటా హోలీ పండుగ**

నేరడిగొండ: మండలకేంద్రంలో ఉన్న బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ నివాసంలో అభిమానులు, కార్యకర్తలు నాయకులు హోలీ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే అనిల్‌జాదవ్ బోథ్ నియోజకవర్గ ప్రజలకు హోలీ పండుగ శుభాకాంక్షలు తెలిపి సరదాగా కార్యకర్తలతో కలిసి డప్పులు వాయిస్తూ నృత్యం చేసి స్వీట్లు పంచి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా బంజారా యువసేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కపిల్‌కుమార్ జాదవ్ ఆధ్వర్యంలో బోథ్ ఎమ్మెల్యే అనిల్‌జాదవ్‌ను కలిసి హోలీ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ శాంతియుతంగా వేడుకలు జరుపుకోవా లని అన్నారు. ఇందులో హస్నాపూర్ సర్పంచ్ ఉపేంద్ర జాదవ్, సోరాజి నాయక్, విక్రమ్‌నాయక్, ఉత్తమ్, మండల నాయకులు రవీందర్‌రెడ్డి, గులాబ్ సింగ్, సక్కా రామ్సరిచంద్, తదితరులు పాల్గొన్నారు.


ఎమ్మెల్యే అనిల్‌కు రంగులు పూస్తున్న నాయకులు

పలుచోట్ల కామదహనం


భైంసాలో కామదహనం చేస్తున్న దృశ్యం

భైంసా, మార్చి 24: పట్టణంలో కామదహనాన్ని ఆదివారం రాత్రి సంప్రదాయ రీతిలో జరిగాయి. వివిధ కాలనీల్లో ఏర్పాటుచేసిన కామునికి ఆయా ప్రాంతాలకు చెందిన ప్రముఖులు ప్రత్యేక పూజలు చేపట్టి దహన కార్యక్రమాలు నిర్వహించి హోలీ పర్వదిన వేడుకలను ప్రారంభించారు. పట్టణంలోని కాలనీలన్నింటిలోనూ కామదహన వేడుకలను ఆయా ప్రాంతవాసులు భక్తిశ్రద్ధల మధ్య సంప్రదాయబద్దంగా ఘనంగా నిర్వహించారు.

ముథోల్: మండలకేంద్రమైన ముథోల్‌తోపాటు మండలంలోని తరోడా, చించాల, వెంకటాపూర్, ఎడ్‌బిడ్, కారేగాం, చింతకుంట తదితర గ్రామాల్లో ఆదివారం రాత్రి కామదహనం వేడుకలను ఘనంగా నిర్వహించారు. గ్రామంలోని ప్రధాన కూడలి వద్ద పిడుకలు పేర్చి పిల్లలు జాజిరి ఆడిన జాజిరి కోలాలు తదితర వాటిని పేర్చి కామదహనం ఘనంగా నిర్వహించారు. అనంతరం కామదహనం నుంచి నిప్పురవ్వలను ఇంటికి తీసు కువెళ్లి ఆనిప్పురవ్వలపై శనిగలను కాల్చితినడం ఆనవాయితీ. ఇలా చేయడం వల్ల కుటుంబంలోని సభ్యులందరూ సుఖసంతోషాలతో ఉంటారని వారి నమ్మకం. బోరిగాం గ్రామంలో ఆదివారం హోలీ పండగ జరుపుకోగా .. మిగతా గ్రామాల్లోని ప్రజలు సోమవారం జరుపుకోనున్నారు.


ముథోల్‌లో కామదహనం చేస్తున్న గ్రామస్థులు



మంత్రికి వినతిపత్రం అందజేస్తున్న ముథోల్ మాజీ ఎంపీటీసీ

ముథోల్‌ను మున్సిపాలిటీగా చేయాలని వినతి

ముథోల్, మార్చి 24: ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోనే మేజర్ గ్రామ పంచాయతీగా ఉన్న ముథోల్‌ను మున్సిపాలిటీగా ఏర్పాటు చేయాలని ముథోల్ మాజీ ఎంపీటీసీ పోతన్న యాదవ్ ఆదివారం భైంసాలో జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్కకు వినతిపత్రం అందజేసినట్లు తెలిపారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో మేజర్ గ్రామ పంచాయతీ అయిన ముథోల్‌ను మున్సిపాలిటీ గా ఏర్పాటు చేయాల్సిందిగా ప్రజలు కోరుకుంటున్నారని, 12 వేల మందికిపైగా ఓటర్లు, 25 వేల మందికి పైగా జనాభా ఉన్న ముథోల్ నగర పంచాయతీకి పట్టణానికి కావాల్సిన అన్ని అర్హతలు ఉన్నాయని వినతి పత్రంలో పేర్కొన్నారు. ముథోల్ అనేది ఏనాటి నుంచో తాలూకాగా ఉందని, నియోజకవర్గం కేంద్రంగా గుర్తింపుఉన్న ముథోల్ కేంద్రంలో తాజాగా మంజూరైన డిగ్రీ కళాశాల, ప్రభుత్వ గురుకుల పాఠశాలలు, ఉర్దూ, మరాఠీ స్కూల్స్, ప్రొఫెసర్ జయశంకర్ విశ్వవిద్యాలయ రీసెర్చ్ సెంటర్, ప్రభుత్వ సీహెచ్‌సీ, పోలీస్ సర్కిల్ కార్యాలయం, ఎమ్మెల్యే క్యాంపు ఆఫీస్ ఇలా ఎన్నో ప్రభుత్వ సంస్థలు కార్యకలాపాలు నిర్వహిస్తున్నాయని వినతిపత్రంలో పేర్కొన్నారు. ముథోల్ నియోజకవర్గంలోని ఇండస్ట్రీయల్ ఏరియా భైంసా ఇప్పటికే పట్టణంగా అభివృద్ధి పథంలో దూసుకుపోతోందని కానీ నియోజకవర్గ కేంద్రమైన ముథోల్ ఇంకా గ్రామ పంచాయతీగానే మిగిలిపోయిందని, ప్రజలు అవకాశాల కోసం పట్టణాల దారి పట్టకుండా నగర పంచాయతీలను మున్సిపాలిటీలుగా మార్చితే ఆయా ప్రాంతాలు త్వరితగతిన అభివృద్ధి చెందుతాయని కాబట్టి ప్రజల కోరిక మేరకు మేజర్ గ్రామ పంచాయతీ అయిన ముథోల్‌ను మున్సిపాలిటీగా ఏర్పాటు చేయాలని విన్నవించారు. అలాగే ముథోల్‌లో నిలిచిపోయిన ఆసుపత్రి నిర్మాణం పనులు వెంటనే ప్రారంభించాలని ఆయన కోరారు.

గుర్తుతెలియని మృతదేహం లభ్యం

బాసర, మార్చి 24: మండలకేంద్రంలో ఆదివారం ఉదయం గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైనట్లు ఎస్సై గణేష్ తెలిపారు. స్థానిక హెచ్‌పీ బంక్ వెనుక ప్రాంతంలో 45 ఏళ్ల వయస్సు గల వ్యక్తి మృతదేహంపై లైట్‌పింక్ కలర్‌షర్ట్, బుడిదరంగు ప్యాంటు ధరించి ఉన్నాడని పేర్కొన్నారు. అతడి వద్ద ఎలాంటి ఆధారాలు లభించలేదని, సంబంధీకులు ఎవరైనా ఉంటే బాసర పోలీస్‌స్టేషన్‌లో సంప్రదించాలని కోరారు.

బాసర నది వద్ద వ్యక్తి ఆత్మహత్యాయత్నం

బాసర, మార్చి24: బాసర గోదావరి నది వద్ద శనివారం మహారాష్ట్రలోని నాందెడ్‌కు చెందిన సుభాష్‌వాగ్మారే అనే వ్యక్తి ఆత్మహత్యయత్నం చేశాడు. రైల్వే వంతెనపై నుంచి నదిలో దిగుతుండగా అక్కడే ఉన్న ఆంజనేయ స్వాములు గమనించి స్థానిక పోలీసులకు సమాచారం అందించారు. బాసర ఎస్సై గణేష్ వెంటనే స్పందించి జాలర్ల సహాయంతో అతన్ని ఒడ్డుకు చేర్చాడు. అనంతరం పోలీస్‌స్టేషన్‌కు తీసుకెళ్లి కౌన్సిలింగ్ నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు ఎస్ఐ గణేష్ తెలిపారు.

'ఆధ్యాత్మిక చింతనతోనే మానసిక ప్రశాంతత'

కుంటాల, మార్చి24: ఆధ్యాత్మిక చింతనతోనే మానసిక ప్రశాంతత లభిస్తుందని మహారాష్ట్ర చిక్లికి చెందిన రెడ్డి మహారాజ్ అన్నారు. ఆదివారం మండల కేంద్రం కుంటాలలో పౌర్ణమిని పురస్కరించుకొని కామదహనం సందర్భంగా ప్రాచీన శ్రీకృష్ణ దేవాలయంలో మహా సత్సంగ్ కార్యక్రమం నిర్వహించారు. ఇందులో రెడ్డి మహారాజ్ పాల్గొని ప్రజలకు ప్రవచనాలు బోధించారు. మానవ జీవితంలో ఆధ్యాత్మిక చింతనతోనే మానసిక ప్రశాంతత లభిస్తుందని, యువత చెడు వ్యసనాలవైపు వెళ్లకుండా ఆధ్యాత్మిక చింతన ఎంతో తోడ్పడుతుందని పేర్కొన్నారు.అనంతరం అన్నదాన కార్యక్రమం చేశారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు ఎల్లమ్మల శంకర్, తాటి శివ, కొండన్నగారి కృష్ణారావు, భక్తులు పాల్గొన్నారు.

పదేళ్ల బీఆర్‌ఎస్ పాలనలో అభివృద్ధి శూన్యం

● దేవుళ్లు, మతాల పేర్లతో బీజేపీ రాజకీయం ● దేశ అభివృద్ధి కాంగ్రెస్‌తోనే సాధ్యం: మంత్రి సీతక్క

భైంసారూరల్, మార్చి24: పదేళ్ల బీఆర్‌ఎస్ పాలనలో అభివృద్ధి శూన్యమని మంత్రి సీతక్క విమర్శించారు. భైంసాలోని ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో ఆదివారం నిర్వహించిన కార్యకర్తల విస్తృతస్థాయి సమావేశానికి ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. మోదీపాలనతో ఒరిగిందేమీ లేదని, దేవుళ్లు, మతాల పేర్లతో బీజేపీ రాజకీయం చేస్తూ ప్రజలను మభ్యపెడుతోందన్నారు. బీజేపీ అధికారంలోకి రాగానే నల్లధనాన్ని వెలికి తీసి ప్రతీ పేదోడి ఖాతాలో రూ.15లక్షలు జమ చేస్తామని పదేళ్ల క్రితం ప్రధాని నరేంద్రమోదీ ఇచ్చిన హామీ ఏమైందని ప్రశ్నించారు. పేదోడి ఖాతాలో కనీసం రూ.10వేలు జమ చేయకుండా ప్రజలను తప్పుదోవ పట్టించారని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు సమాచార హక్కు చట్టాన్ని తెస్తే ఈ పదేళ్లలో బీజేపీ ప్రభుత్వం దాన్ని నిర్వీర్యం చేసిందన్నారు. కాంగ్రెస్‌ప్రభుత్వం అధికారంలోకి రాగానే రెండోరోజే మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించామన్నారు. 10లక్షల బీమా, 500లకే గ్యాస్ కనెక్షన్, గృహజ్యోతి పథకం కింద 200 యూనిట్లలో ఉన్న ప్రతీ కుటుంబానికి ఉచిత విద్యుత్, ఇళ్లులేని ప్రతీ పేదలకు ఇందిరమ్మ పథకం కింద రూ.5లక్షలు ఇంటి నిర్మాణం కోసం ఇస్తున్నట్లు చెప్పారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం చేసిన రూ.6లక్షల కోట్ల అప్పు ఉన్నా రాష్ట్రం అభివృద్ధి పథంలో నడిపిస్తున్నామన్నారు. 3రోజుల క్రితమే మాజీ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి సీఎం రేవంత్ రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరినట్లు చెప్పారు. బీఆర్‌ఎస్ హయాంలో పదేళ్లు ఎమ్మెల్యేగా ఉండి కూడా గ్రామానికి నిధులు రాలేదని, గ్రామాల అభివృద్ధి కాంగ్రెస్ ప్రభుత్వంతోనే సాధ్యమవుతుందని వారు కాంగ్రెస్‌లో చేరినట్లు తెలిపారు. విఠల్‌రెడ్డి మాట్లాడుతూ గుండేగాం పల్సికర్ రంగారావు ప్రాజెక్టు బ్యాక్ వాటర్‌తో ముంపుకు కావడంతో ఆ గ్రామస్థులు నానా అవస్థలు పడుతున్నారని మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం రూ.90 కోట్ల నిధులు విడుదల చేసినా అది కార్యరూపం దాల్చలేదన్నారు. దీనిపై ప్రత్యేక దృష్టిపెట్టి పునరావాసం కల్పించాలని కోరారు. సిరాల ప్రాజెక్టు కింద 2వేల ఎకరాలకు సాగునీరు ప్రతీ ఏడాది అందుతుందన్నారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు చెరువు తెగిపోవడంతో చెరువులో నీరు లేకపోవడంతో రైతులకు సాగునీరు అందక రబీ పంటలు వేయలేక అక్కడి పరిసర రైతులు ఆర్థికంగా నష్టపోయారన్నారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో ఉన్న ఐటీడీఏ పరిధిలో గల నిర్మల్ జిల్లాకు పెద్దమొత్తంలో నిధులు మంజూరు చేయాలని మంత్రిని కోరారు. మంత్రి సానుకూలంగా స్పందించి ప్రత్యేకదృష్టి పెడుతానన్నారు. మాజీ ఎమ్మెల్యే నారాయణపటేల్ మాట్లాడుతూ విఠల్‌రెడ్డి కాంగ్రెస్ పార్టీలో చేరటం పార్టీకి చాలా బలమవుతుందన్నారు. ప్రతీ కార్యకర్త, ప్రజాప్రతినిధులు గ్రూపులు చేయకుండా కలిసిమెలిసి పనిచేసి ఆదిలాబాద్ జిల్లా ఎంపీని గెలిపించడమే ధ్యేయంగా పనిచేయాలన్నారు. సమావేశంలో నిర్మల్ జడ్పీవైస్ చైర్మన్ బాశెట్టి సాగరబాయి రాజన్న, తానూర్ మండల పీఏసీఎస్ చైర్మన్ నారాయణ పటేల్, నిర్మల్ జిల్లా డీసీఈస అధ్యక్షులు శ్రీహరి రావు, ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్, డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు ఆనందరావు పటేల్, హోమ్ ప్రకాష్, బుచ్చన్న, బాశెట్టి రాజన్న, పీఏసీఎస్ చైర్మన్ దేవేందర్ రెడ్డి, సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు సంజీవ్ రెడ్డి, కోఆప్షన్ సభ్యులు గజేందర్, ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, జడ్పీటీసీలు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి సీతక్క

మంత్రిని కలిసిన ఇంజనీర్ల సంఘం నాయకుడు

నిర్మల్‌కల్చరల్: మంత్రి సీతక్కను ఆదివారం పంచాయతీరాజ్ డిప్లమా ఇంజనీర్ల సంఘం రాష్ట్ర సలహాదారు కామారపు జగదీశ్వర్ మర్యాదపూర్వకంగా కలిసి ఆమెను సన్మానించారు. పెండింగ్‌లో ఉన్న పంచాయతీ ఏఈ, డీఈఈ పదోన్నతులు చేపట్టాలని మంత్రికి విన్నవించారు.



అమ్మవారిని దర్శించుకుంటున్న మంత్రి

బాసరలో మంత్రి ప్రత్యేక పూజలు

బాసర: జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క ఆదివారం తొలిసారిగా బాసర ఆలయాన్ని సందర్శించారు. అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అంతకుముందు ఆలయానికి చేరుకున్న మంత్రికి స్థానిక నాయకులు స్వాగతం పలికారు. ఎన్నికల కోడ్ అమలులో ఉండడంతో మంత్రితోపాటు నాయకులు అమ్మవారిని సాధారణ భక్తుల్లాగే దర్శించుకున్నారు. మంత్రివెంట ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు శ్రీహరిరావు, మాజీ ఎమ్మెల్యేలు నారాయణ రావు పటేల్, విట్టల్ రెడ్డి, సీనియర్ నాయకులు ఆనంద్‌రావు పటేల్, బాసర మండల కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు సంజీవ్ రావు దేశాయ్, తదితరులు ఉన్నారు.

'కదిలి' వచ్చిన సీతక్క

దిలావర్‌పూర్, మార్చి24: మండలంలోని శ్రీ మాతాన్నపూర్ణ కదిలి పాపహరేశ్వర స్వామిని దర్శించుకునేందుకు రాష్ట్ర పంచాయతీరాజ్, మహిళా శిశు సంక్షేమ శాఖల మంత్రి ధనసరిఅనసూయ అలియాస్ సీతక్క ఆదివారం కదిలి వచ్చారు. డీసీసీ అధ్యక్షుడు కే.శ్రీహరిరావు, కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థిత్వాన్ని ఆశిస్తున్న ఆత్రం సుగుణ భాస్కర్‌తో కలిసి పాపహరేశ్వర స్వామిని, మాతాన్నపూర్ణ దేవిని దర్శించుకుని ప్రత్యేక పూజలుచేశారు. అనంతరం దేవస్థానం చైర్మన్ నర్సాడి వెంకట్‌రావు మంత్రి సీతక్కను ఘనంగా సన్మానించారు. అనంతరం పేద, సాదలను ఆదుకున్న ఇందిరమ్మను గుర్తు చేస్తూ మాడేగాంలో మాట్లాడారు. ఇందిరమ్మ మనుమడు రాహుల్ గాంధీని ఈసారి ప్రధాన మంత్రిని చేద్దామని మంత్రి సీతక్క పేర్కొన్నారు. ఆమె వెంట కాంగ్రెస్ నాయకులు ఉన్నారు.



పాపహరేశ్వర స్వామికి హారతి ఇస్తున్న మంత్రి

పార్లమెంట్ ఎన్నికల్లో ప్రతీ కార్యకర్త సైనికుడిలా పనిచేయాలి

● కాంగ్రెస్ పార్టీ గెలుపే లక్ష్యంగా టీజేఎస్ కార్యకర్తలు ముందుకు సాగాలి: టీజేఎస్ అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరాం

ఖానాపూర్, మార్చి24: పార్లమెంట్ ఎన్నికల్లో ప్రతీ టీజేఎస్ కార్యకర్త ఓ సైనికుడిలా పనిచేయాలని ఆ పార్టీ అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరాం అన్నారు. నిర్మల్ జిల్లా ఖానాపూర్‌లోని జేకే ఫంక్షన్ హాల్‌లో ఆదివారం నిర్వహించిన తెలంగాణ జన సమితి ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా విస్తృత కార్యకర్తలస్థాయి సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కాంగ్రెస్ విజయం కోసం ప్రతీ టీజేఎస్ కార్యకర్త క్షేత్రస్థాయిలో రెట్టింపు ఉత్సాహంతో పనిచేయాలన్నారు. కొంతమంది నాయకులు బీఆర్‌ఎస్ పాలనను స్వర్ణయుగంగా అభివర్ణించడం హాస్యాస్పదమని కోదండరాం విమర్శించారు. డిగ్రీ కళాశాల, గిరిజన యూనివర్సిటీ, పోడు భూముల సమస్య, డి-24, 28 కెనాల్ సమస్యను సీఎం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేలా కృషి చేస్తానన్నారు.



అలేఖ్య కుటుంబీకులను పరామర్శిస్తున్న కోదండరాం

● అలేఖ్య హత్య అత్యంత దారుణం..

అలేఖ్య హత్య ఘటన అత్యంత దారుణమైందని ప్రొఫెసర్ కోదండరాం ఆవేదన వ్యక్తం చేశారు. పట్టణంలోని అంబేడ్కర్ నగర్ కాలనీలో గల అలేఖ్య నివాసానికి వచ్చిన కోదండరాం ఆమె కుటుంబ సభ్యులను పరామర్శించారు. హత్యకు గల కారణాలను సీపీఐఎంఎల్ మాస్ లైన్ ప్రజాపంథా ఉమ్మడి జిల్లా అధ్యక్షుడునంది రామయ్యను, అలేఖ్య కుటుంబ సభ్యులను అడిగి తెలుసుకున్నారు. నిందితుడికి శిక్షపడేలా ఫాస్ట్‌ట్రాక్ కోర్టు ఏర్పాటు చేయాలని డిమాండ్‌చేశారు. శ్రీకాంత్ దాడిలో గాయపడ్డ జయశీలను కోదండరాం పరామర్శించారు.

● కడెం ప్రాజెక్టు పరిశీలన

గత ఏడాది వచ్చిన భారీ వరదలకు దెబ్బతిన్న కడెం ప్రాజెక్టును ప్రొఫెసర్ కోదండరాం పరిశీలించారు. ప్రస్తుతం ప్రాజెక్టు వద్ద జరుగుతున్న మరమ్మతు పనుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. కడెం ప్రాజెక్టుకు యుద్ధ ప్రాతిపదికన మరమ్మతులు పూర్తి చేస్తే స్థానిక రైతాంగానికి రాబోయే పంటకు అండగా నిలిచినట్లు అవుతుందని ఆయన అభిప్రాయం వ్యక్తంచేశారు. కార్యక్రమంలో రైతు విభాగం రాష్ట్ర అధ్యక్షులు కాంతిమోహన్‌రెడ్డి, సర్దార్ వినోద్, మంచిర్యాల, ఆసిఫాబాద్ జిల్లాల అధ్యక్షులు, కార్యదర్శులు దుర్గు, గోనె శ్రీనివాస్, బెనహర్ సిరాజ్, రాజేశ్వర్ రెడ్డి, లింగన్న, మల్లారెడ్డి, శ్రీనివాస్, రాజేశ్వర్, తదితరులున్నారు.

● సంఘాల పునరుద్ధీకరణతో సమస్యలు పరిష్కారం

నిర్మల్‌కల్చరల్: సంఘాల పునరుద్ధీకరణతో సమస్యలు పరిష్కరించుకోవచ్చని ఆచార్య కోదండరాం అన్నారు. ఆదివారం పెన్షనర్ల సంఘ భవనంలో ఉపాధ్యాయ, ఉద్యోగ‌పెన్షనర్ల సమస్యలు-ప్రభుత్వ విధానాలు అనే అంశంపై నిర్వహించిన సదస్సుకు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వ విధానాలు ఉద్యోగుల సమస్యలు పరిష్కరించలేకపోయాయని ఆరోపించారు. కాళేశ్వరం సమస్యలో ఇంజనీర్లు ఇబ్బందులు పడ్డారని బీఆర్‌ఎస్ ప్రభుత్వాన్ని ఉద్దేశించి వ్యాఖ్యానించారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు ఏ. విజయ్ కుమార్, పెన్షనర్ల సంఘంఅధ్యక్షుడు ఎంసీ లింగన్న, తదతరులున్నారు.

కారు, ద్విచక్ర వాహనం ఢీ

● ఒకరి మృతి, మరొకరికి తీవ్ర గాయాలు

లోకేశ్వరం, మార్చి24: కారు, ద్విచక్రవాహనం ఢీకొన్న ప్రమాదలో ఒకరు మృతిచెందగా మరొకరికి తీవ్రగాయాలైన ఘటన లోకేశ్వరం మండలంలో ఆదివారం చోటుచేసుకుంది. ఎస్సై కోసన రాజు తెలిపిన వివరాల ప్రకారం భైంసా మండలం మాటేగాం సమీపంలోని రైస్‌మిల్లులో పని చేసే బీహార్ రాష్ట్రానికి చెందిన కూలీలు శనివారం అర్ధరాత్రి నిజామాబాద్ జిల్లా నందిపేట్ వైపు వెళ్తుండగా పంచగుడి బ్రిడ్జిపై లోకేశ్వరం వైపు వస్తున్న కారు ఏపీ 01 హెచ్ 2140ను నాంపల్లి రాము అనే వ్యక్తి అతి వేగంగా అజాగ్రత్తగా నడపడంతో వీరు ప్రయాణిస్తున్న ద్విచక్ర వాహనం ఎదురెదురుగా ఢీకొనడంతో బీహార్ రాష్ట్రానికి చెందిన జితేందర్ కుమార్ సంఘటన స్థలంలోనే మృతి చెందగా, ద్విచక్ర వాహనంపై వెనక కూర్చున్న అభిషేక్ కుమార్ అనే యువకుడికి తీవ్ర గాయాలయ్యాయని, మృతుడి రైస్‌మిల్ యజమాని మహేందర్ రెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.



ఘటనా స్థలంలో జితేందర్ కుమార్ మృత దేహం



పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఉట్నూర్ సీఐ మొగిలి

పోలింగ్ కేంద్రాల పరిశీలన

ఇంద్రవెల్లి, మార్చి 24: పోలింగ్ కేంద్రాల వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేస్తున్నామని ఉట్నూర్ సీఐ మొగిలి అన్నారు. ఆదివారం మండలకేంద్రంలోని పలు పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. వసతులు సక్రమంగా ఉన్నాయనేది పంచాయతీ, గ్రామస్థులతో అడిగి తెలుసుకున్నారు. సెంటర్ల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుందని ప్రతి ఒక్కరు. ఎన్నికల నిబంధనలను పాటించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్సై దుబ్బాక సునీల్, కాంగ్రెస్ పార్టీ నాయకులు, సోమోరే నాగోరావు, పంచాయతీ సిబ్బంది ఇద్రిష్, రాందాస్, తదితరులు పాల్గొన్నారు.

మహాలక్ష్మి ఆలయంలో పూజలు

జైనథ్, మార్చి 24: జైనథ్ మండలంలోని కూర గ్రామంలో నూతనంగా నిర్మించిన మహాలక్ష్మి (దేవవ్వ) ఆలయంలో ఆదివారం మండలంలోని లక్ష్మీపూర్ గ్రామానికి చెందిన మహిళలు భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా కూరలక్ష్మీపూర్ గ్రామాల ప్రజలు పాడి పంటలతో చల్లంగా ఉండాలని బోనాలు సమర్పించారు. ఈ సందర్భంగా దేవవ్వకు మేకలు కోళ్లను బలి ఇచ్చారు. కార్యక్రమంలో సర్పంచ్ అడ్డిలత వెంకటరెడ్డి, మాజీ సర్పంచ్ మాశెట్టి వెంకన్నలక్ష్మీపూర్, మాజీ సర్పంచ్ అడప తిరుపతి, మాజీ మండల ఉపాధ్యక్షులు ఎ.కల్పాప్ రెడ్డి, మహిళలు, భక్తులు పాల్గొన్నారు.

ఎయిడ్స్‌పై అవగహన

తాంసి, మార్చి 24: ప్రస్తుతం హెచ్ఐవి పట్టిపీడిస్తుంది. అవగహన లోపంతో ఈ వ్యాధి సోకడం పట్ల అవగాహన కల్పించేలా ప్రభుత్వం కొత్త కార్యక్రమాలకు శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా ఆదివారం సాయంత్రం మండల కేంద్రంలో కళాజాతా బృందంతో అవగహన సదస్సు ఏర్పాటు చేశారు. పాటలు. పద్యాలు. నృత్యాల రూపంలో యువతకు అవగహన కల్పించారు.

సరిహద్దు చెక్‌పోస్టులో తనిఖీ

బోథ్, మార్చి 24: మండలంలోని సరిహద్దు ఘన్పూర్ చెక్‌పోస్ట్‌లో అధికారులు ముమ్మర తనిఖీలు చేపట్టారు. మహారాష్ట్ర నుంచి వచ్చి పోయే వాహనాలను తనిఖీలు చేస్తున్నారు. రెవెన్యూ పోలీస్ శాఖాల అధికారులతో పాటు మండల పరిషత్ రెవెన్యూ శాఖలో అధికారులు తనిఖీల్లో పాల్గొంటున్నారు. ఆదివారం వచ్చిపోయే వాహనాలలో అక్రమంగా మద్యం రాకుండా డబ్బులు రాకుండా నిఘా వేసి పట్టుకుంటున్నారు. చెక్‌పోస్టులో ఏఎస్ఐ గంగారెడ్డి, ఏఆర్ సిబ్బంది సీతారామరాజు సిద్దార్థ కైలాస్ ఉగాదిరావులతో పాటు రఘువీరారెడ్డి, ఇరిగేషన్ డిపార్టుమెంట్ శ్రీనివాస్, మండల పరిషత్ కార్యాలయం శ్యామ్ సుందర్, తదితరులు ఉన్నారు.

జోరుగా మొరం అక్రమ తవ్వకాలు!

● భారీ విద్యుత్ టవర్‌కు పొంచి ఉన్న ముప్పు ● సంబంధిత శాఖ అధికారులకు తెలిసినా.. పట్టింపు కరువు ● కజ్జర్ల శివారు ప్రాంతంలో ఘటన

తలమడుగు, మార్చి 24: ఆదిలాబాద్ జిల్లా తలమడుగు మండలంలోని కజ్జర్ల శివారు ప్రాంతంలోని అసైన్డ్ భూమిలో అక్రమ మొరం తవ్వకాలతో విద్యుత్ టవర్‌కు పొంచి ఉన్న ముప్పుతో సంబంధిత శాఖ అధికారులకు తెలిసినా.. ఎవరు పట్టించుకోవడం లేదని సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. జిల్లాకు కూత వేటు దూరంలో కజ్జర్ల శివారు ప్రాంతంలోని అసైన్డ్ భూములలో జోరుగా అక్రమ మొరం తవ్వకాలు సాగుతున్న ఎవరు పట్టించుకోవడం లేదు. ప్రభుత్వ అనుమతి లేకుండా ప్రతి రోజు భారీ యంత్రాలతో వందలాది ట్రిప్పుల మొరం తరలిస్తున్న సంబంధిత శాఖ అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారు. అక్రమ మొరం తరలించే వారికి రాజకీయ నాయకుల అండదండలు ఉండడంతో అటుగా ఏ అధికారి గాని వెళ్లలేక పోతున్నారు. అక్రమ మొరం తవ్వకాలతో భారీ గుంతలు ఏర్పడి ప్రమాదాలకు నిలయంగా మారిన వారిపై ఇప్పటి వరకు ఎలాంటి చర్యలు లేదు. అక్రమ మొరం తవ్వకాలతో ఏర్పడ్డ భారీ నీటి గుంతలతో గతంలో పలు ప్రమాదాలు జరిగి కొంత మంది మృత్యువాత పడ్డారు. అయిన నిమ్మకు నీరెత్తనటు అక్రమ మొరంను ఎవరు అడ్డుకోలేక పోతున్నారు. అంతేకాకుజిల్లా కేంద్రం నుంచి ఇతర ప్రాంతాలకు విద్యుత్ లైన్ కలిగిన భారీ విద్యుత్ స్థంబాలు పక్కనే ఉన్నప్పటికి వాటిని పట్టించుకోకుండా విద్యుత్ స్థంబాల వద్దని భారీ యంత్రాలతో మొరం తవ్వకాలను రాత్రి పగలు తేడా లేకుండా సాగిస్తున్నారు. ఒకవేళ విద్యుత్ స్థంబం తెగిపడితే భారీగా నష్టం జరిగే అవకాశం లేకపోలేదు. ఇకనైనా ఉన్నతాధి కారులు స్పందించి అక్రమంగా తవ్వకాల జరుపుతున్న వారి పై కఠిన చర్యలు తీసుకొని పొంచి ఉన్న విద్యుత్ స్థంబానికి తగిన ఏర్పాటు చేయాలని పలువురు కోరుతున్నారు.





కజ్జర్ల శివారులోని అసైన్డ్ భూముల్లో భారీ యంత్రాలతో మొరం తవ్వుతున్న దృశ్యం(విద్యుత్ స్తంభం వద్ద ప్రమాదకరంగా ఏర్పడ్డ గుంత)

లక్ష్మింపూర్ చెక్‌పోస్టు వద్ద రూ.2లక్షల పట్టివేత

● రూ.50 వేలకు మించి ఎవరూ తీసుకెళ్లొద్దు : రూరల్ సీఐ ఫణిందర్

తలమడుగు, మార్చి 24: మండలంలోని తెలంగాణ-మహారాష్ట్ర సరిహద్దు ప్రాంతంలోని లక్ష్మీపూర్ చెక్‌పోస్టు పార్లమెంట్ ఎన్నికల వేళ వాహనాలు తనిఖీ చేయగా మహారాష్ట్ర నాందేడ్ నుంచి ఆదిలాబాద్ వస్తున్న ఎంహెచ్26సీఈ 7458 హ్యూండాయ్ అకజర్ గల వాహనంలో ఎలాంటి ఆధారాలు లేకుండా రూ.2 లక్షలు శ్రీముక్తార్ జాగిర్ధార్ అనే వ్యక్తి నాందెడ్ తీసుకెళ్లుచుండగా లక్ష్మంపూర్ చెక్‌పోస్టు వద్ద ఎన్నికల అధికారులు పట్టుకున్నట్లు ఆదిలాబాద్‌రూరల్ సీఐ ఫణిందర్ తెలిపారు. ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం ఎన్నికల కోడ్ ఉన్నందున ఎవరు కూడా పెద్దమొత్తంలో నగదును తీసుకెళ్లదన్నారు. రూ.50 వేలకు పైగా తీసుకెళ్లే దానికి సంబంధించిన ఆధారాలు చూపించాలి అన్నారు. ఇందులో లక్ష్మీపూర్ చెక్‌పోస్టు ఎన్నికల విధులు నిర్వహిస్తున్న అధికారులు మాణిక్‌ప్రభు, బి.సురేందర్, ఏఎస్సై, జె.దత్తు, ఎఆర్‌హెచ్‌సీ, పిశేషరావు, ఏఆర్ పీసీ ఇట్టి వాటిని పట్టుకున్నారు.ఎన్నికల నిబంధనలు లోబడి రూ.50వేల మించి తీసుకెళ్ల కూడదని ఒక వేళ తీసుకెళ్లి చిన్నచో అట్టి వాటికి ఆధారాలు చూపించి తీసుకెళ్లాల్సిందిగా కె.ఫణిదర్ సీఐ ఆఫ్ పోలీసు ఆదిలాబాద్‌రూరల్ తలమడుగు ఎస్సై కె.ధనశ్రీ, ఏఎస్సై సురేందర్, తదితరులు తెలిపారు.



వాహనాల తనిఖీలో భాగంగా పట్టుబడ్డ రూ.2 లక్షలు

కిలోన్నర గంజాయి పట్టివేత

మావల, మార్చి 24: మావల పోలీస్‌స్టేషన్ పరిధిలోని సుభాష్‌నగర్‌లో కిలోన్నర గంజాయిని పట్టుకున్నట్లు మావల ఎస్సై విష్ణువర్ధన్ తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. బేల మండలం వంజారిగూడ గ్రామానికి చెందిన కుడిమేత నాందేవ్ ఆదిలాబాద్‌కు గంజాయి సరఫరా చేస్తుంటాడు. ఆదిలాబాద్ పట్టణంలోని సుభాష్‌నగర్‌కు చెందిన షేక్ ఖలీం కుడిమేత నాందేడ్ నుంచి కొనుగోలు చేసి మహారాష్ట్రలోని వ్యక్తులకు విక్రయంచేస్తుంటాడు. ఇదే క్రమంలో వాహన తనిఖీల్లో కలీం పట్టుబడ్డాడు. దీంతో కేసు నమోదు కలీంను రిమాండ్ చేశారు.

రైల్వే స్టేషన్ వద్ద మృతదేహం లభ్యం

ఆదిలాబాద్ అర్బన్, మార్చి24:ఆదిలాబాద్ రైల్వేస్టేషన్ ముందు ప్లాట్‌ఫాం పై వ్యక్తి మృతదేహన్ని పోలీసులు ఆదివారం తెల్లవారు జామున గుర్తించారు. మృతుడి వద్ద లభించిన ఆధార్‌కార్డు ద్వారా అతను బెజ్జూర్ మండలం కొత్తగూడెంకు చెందిన శంకర్‌గా పోలీసులు గుర్తించారు. అతని బంధువులకు పోలీసులు సమాచారం అందించారు. కాగా మృతుడి తలపగిలి రక్తస్రావం కావడంతో అనుమానస్పద మృతిగా భావిస్తున్నట్లు పోలీసులు భావిస్తున్నారు. క్లూస్ టీం ద్వారా ఆధారాలు సేకరిస్తున్నట్లు తెలిపారు.



క్రీడాకారులకు బహుమతులను అందజేస్తున్న దృశ్యం

సబ్ జూనియర్ సాఫ్ట్‌బాల్ పోటీల్లో జిల్లా జట్టుకు తృతీయ స్థానం

నేరడిగొండ, మార్చి 24: ఈనెల 23నుంచి 24 వరకు నల్లగొండ జిల్లాలోని ఆలేరు మండలంలోని 8వ సబ్‌జూనియర్ సాఫ్ట్‌బాల్ చాంపియన్‌షిప్‌లో ఆదిలాబాద్ బాలుర జట్టు సెమిఫైనల్ మెదక్‌జట్టు పై 01 తేడాతో ఓటమి చెంది హన్మకొండ జిల్లా జట్టుపై 15 రన్నుల తేడాతో గెలిచి తృతీయ స్థానం కైవసం చేసుకుందాని జిల్లా ప్రధాన కార్యదర్శి గస్కంటి గంగాధర్ తెలిపారు. ఈ జట్లకు ముఖ్య అతిథిగా ఇండియా సాఫ్ట్‌బాల్ జాయింట్ సెక్రటరీ కానపురం శోభన్‌బాబు, తెలంగాణ సాఫ్ట్‌బాల్ ఉపాధ్యక్షులు అభిషేక్‌గౌడ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.నవీన్‌లు పాల్గొని బహుమతిలు అందజేశారు. ఆదిలాబాద్ ఆల్ రౌండర్ క్రీడాకారుడుగా డా.వెంకటేశ్‌కి అవార్డు అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా సాఫ్ట్‌బాల్ అధ్యక్షుడు అనిల్ జాదవ్ ఎమ్మెల్యే, జిల్లా ఒలింపిక్ అధ్యక్షుడు బాలకూరి గోవర్ధన్‌రెడ్డి, గిరిజన జిల్లా స్పోర్ట్స్ అధికారి పార్థసారథి, డీవైఎస్‌వో వెంకటేశ్వర్లు, జిల్లా ఉపాధ్యక్షుడు గోడంజ్యోతిరాం, జాయింట్ సెక్రటరీ నాగరాజు, శ్యామ్, కోచ్ అఖిల, స్నేహ మోహన్‌లు అభినందించారు.

మొక్కల పెంపకంపై ప్రత్యేకశ్రద్ధ చూపండి

● ఎంపీడీవో గడ్డం మోహన్ రెడ్డి

తాంసి, మార్చి 24: మండలంలోని ఆయా గ్రామాలలో ఏర్పాటు చేసిన నర్సరీలలో మొక్కలు పెంపకంపై ప్రత్యేక చూపాలని ఎంపీడీవో మోహన్ రెడ్డి అన్నారు. ఆదివారం సాయంత్రం మండలంలోని వడ్డాడి, హస్నాపూర్ గ్రామాలలో ఉన్న నర్సరీలను ఆయన పరిశీలించారు. ఈ సంద్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ ప్రతీ నర్సరీలలో పదివేల మొక్కలకు సరిపడా సంచులను నింపి సిద్ధంగా ఉంచాలన్నారు. కార్యదర్శులు వారి వారి విధులను బాధ్యతాయుతంగా నిర్వహించాలని ఆదేశించారు. మండలంలోని ఆయా గ్రామాల్లో విధులు నిర్వహిస్తున్న ప్రత్యేక అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించారు. నర్సరీల విషయంలో నిర్లక్ష్యం చేస్తే కఠిన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు.

క్రీడల్లో గెలుపు ఓటములు సహజం

● రాష్ట్ర మాజీ మంత్రి జోగురామన్న

జైనథ్, మార్చి 24: ఆదిలాబాద్ నియోజకవర్గంలో జోగు ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆయా గ్రామాల్లో జరుగుతున్న క్రికెట్ పోటీల్లో గె లుపు ఓటములు సహజమని రాష్ట్ర మాజీ మంత్రి జోగురామన్న అన్నారు. ఆదివారం జైనథ్ మండలంలో గత వారం రోజులుగా జరుగుతున్న క్రికెట్ టోర్నమెంట్ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఓడినవారు నిరాశకు గురికాకుండా ఆసక్తి కలిగిన యువకులు క్రీడల్లో నైపుణ్యాలను మెరుగు పరుచుకోవాలన్నారు. గెలుపొందిన మొదటి జట్టుకు రూ.25 వేలను అందజేశారు. ఈ కార్యక్రమంలో జైనథ్ ఎంపీపీ ఎం.గోవర్ధన్, కంఠం గ్రామ తాజా మాజీ సర్పంచ్ వైద్యబాలాజి, నాయకులు ఇజ్జగిరి నారాయణ, బాలాజి, లక్ష్మణ్‌లతో పాటు ఆయా గ్రామాల క్రికెట్ క్రీడాకారులు పాల్గొన్నారు.

andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ఆదివారం ఉష్ణోగ్రత గరిష్ఠం 38.5, కనిష్ఠం 24.9



నిర్మల్
జిల్లా వార్తలు
8
సోమవారం 25 మార్చి 2024

రూ.75వేల నగదు పట్టివేత

నర్సాపూర్ (జి), మార్చి 24: ఎన్నికల కోడ్ అమలులో ఉన్న నేపథ్యంలో నర్సాపూర్ (జి) పోలీస్‌స్టేషన్ పరిధిలోని జాతీయ రహదారిపై ఆదివారం పోలీసుల తనిఖీల్లో ఎలాంటి ఆధారాలూ లేకుండా తీసుకెళ్తున్న రూ.75 నగదును స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై మునిగెల హన్మాండ్లు తెలిపారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ వాహనాల తనిఖీలు చేస్తుండగా కారులో ముంబై నుంచి వెల్మల్ గ్రామానికి వెళ్తున్న బైండ్ల నర్సయ్య వద్ద రూ.75 నగదు పట్టుకున్నట్లు తెలిపారు. తనిఖీల్లో సిబ్బంది సాయన్న, మహేందర్, వెంకటి, కృష్ణ, సురేష్ ఉన్నారు.



కాంగ్రెస్‌లో చేరిన మున్సిపల్ మాజీ చైర్మన్‌తోపాటు పలువురు బీఆర్ఎస్ నాయకులు (ఫైల్)

కారు ఖాళీ!

- కాంగ్రెస్ పార్టీ కండువా కప్పుకుంటున్న బీఆర్ఎస్ నేతలు
- మాజీ చైర్మన్‌ల చేరికతో పట్టణంలో సమీకరణలు తారుమారు
- మాజీ మంత్రి అల్లోల చేరికపై సందిగ్ధత
- మరికొద్ది రోజుల్లో రసవత్తరం కానున్న రాజకీయం

నిర్మల్, మార్చి24 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో అనూహ్య రాజకీయ పరిణామాలు చోటుచేసుకుంటున్నాయి. వంద రోజుల క్రితం వరకు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ నాయకులంతా నేడు ఆపార్టీ అధికారం కోల్పోవడంతో ఇక కారు దిగి కాంగ్రెస్ పార్టీలో చేరిపోతున్నారు. కొద్దిరోజులుగా బీఆర్ఎస్‌కు చెందిన స్థానిక నాయకులంతా వరుస కట్టి కాంగ్రెస్‌లో చేరుతుండగా గురువారం ఏకంగా ఆ పార్టీకి చెందిన జిల్లా అధ్యక్షులు, ముథోల్ మాజీ ఎమ్మెల్యే విఠల్ రెడ్డి సీఎం రేవంత్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరిన సంగతి తెలిసిందే. అలాగే శనివారం నిర్మల్ ఎంపీపీ రామేశ్వర్‌రెడ్డి, మాజీ గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఎర్రవోతు రాజేందర్, మాజీ మున్సిపల్ చైర్మన్ అప్పాల గణేష్ చక్రవర్తి, మున్సిపల్ ఫ్లోర్‌లీడర్ వేణు తదితరులు కూడా సీఎం రేవంత్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. ఈ పరిణామం రాబోయే రోజుల్లో పెద్దఎత్తున జరగబోయే మరిన్ని పార్టీ ఫిరాయింపులకు సూచికగా పేర్కొంటున్నారు.

చేరికలపై సమాలోచనలు

కొద్దిరోజుల నుంచి నిర్మల్‌కు చెందిన మాజీ మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి తన అను చరులతో కలిసి కాంగ్రెస్ పార్టీలో చేరేందుకు రంగం సిద్ధం చేసుకున్నారనే ప్రచారం సాగింది. ఆయన కాంగ్రెస్ అగ్రనేత నేతలందరితో తన చేరికపై సమాలోచనలు జరిపినట్లు సమాచారం. దీంతోపాటు ఆయన నిర్మల్‌లో పార్టీ సీనియర్‌నేతలు, తన అనుచరులతో సీరియస్‌గా మంతనాలు సైతం జరిపారు. పార్టీ కేడరంతా కాంగ్రెస్ పార్టీలో చేరాలని ఆయనపై ఒత్తిడి తీసుకువస్తున్నారు. ఇదిలాఉండగా ఇంద్రకరణ్‌రెడ్డిని కాంగ్రెస్‌లో చేర్చుకోవద్దంటూ ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు గత 10 రోజులుగా ఆందోళనలు కొనసాగిస్తున్నారు. వీరంతా సీఎం రేవంత్‌రెడ్డిని సైతం కలిసి ఇంద్రకరణ్‌రెడ్డిని పార్టీలో చేర్చుకోవద్దంటూ కోరారు. ఈ క్రమంలోనే ఇంద్రకరణ్‌రెడ్డి చేరికను పరోక్షంగా వ్యతిరేకిస్తున్న డీసీసీ అధ్యక్షుడు శ్రీహరిరావు వ్యూహాత్మకంగా పావులు కదుపుతూ ద్వితీయ శ్రేణి నాయకులు అందరినీ కాంగ్రెస్‌లో చేర్చుకునే ప్రయత్నాలు ముమ్మరంచేశారు. కాంగ్రెస్‌పార్టీ కార్యకర్తల నుంచి పెద్దఎత్తున ఒత్తిడి వస్తుండడంతో ఇంద్రకరణ్‌రెడ్డి చేరికపై అధిష్టానం ఇప్పటికిప్పుడే గ్రీన్‌సిగ్నల్ జారీచేసే అవకాశాలు లేవంటున్నారు. ఇదే జరిగితే ఆయన కాంగ్రెస్ పార్టీలో చేరే అంశంపై సందిగ్ధత నెలకొంటుందని చెబుతున్నారు. ఇదిలా ఉండగా మాజీ మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి అనుచరులైన బీఆర్ఎస్ పార్టీ సీనియర్‌నేతలు, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఎర్రవోతు రాజేందర్ ఆధ్వర్యంలో నిర్మల్ ఎంపీపీ రామేశ్వర్‌రెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్ అప్పాల గణేష్ చక్రవర్తి, మున్సిపల్ ఫ్లోర్‌లీడర్ నేరేళ్ల వేణు తదితరులు బీఆర్ఎస్ పార్టీకి రాజీనామా చేసి సీఎం రేవంత్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. మాజీ మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డిని పార్టీలో చేర్చుకునేందుకు అధిష్టానం సుముఖంగా లేకపోవడంతోనే వీరంతా ఆయనతో ప్రమేయం లేకుండా కాంగ్రెస్‌లో చేరారని పేర్కొంటున్నారు. అయితే బీఆర్ఎస్ పార్టీకి చెందిన ఇద్దరు కౌన్సిలర్‌లు నల్లూరి పోశెట్టి, తారక వాణి రఘువీర్‌లు ఇప్పటికే బీఆర్ఎస్‌కు రాజీనామా చేసి శ్రీహరిరావు సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. వీరితోపాటు మామడ మండలానికి చెందిన బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నేత, వైఎస్ ఎంపీపీ ఎనుగు లింగారెడ్డితోపాటు దాదాపు వంద మందికి పైగా బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు శ్రీహరిరావు ఆధ్వర్యంలో కాంగ్రెస్ కండువాలు కప్పుకున్నారు. పార్టీకి చెందిన తన సన్నిహితులు, సీనియర్ నేతలంతా కాంగ్రెస్‌పార్టీలో చేరుతుండడంతో మాజీమంత్రి అల్లోల ఇంద్రకరణ్ రెడ్డి అంతర్మధనానికి లోనవుతున్నట్లు చెబుతున్నారు. చేరిక విషయంలో అధిష్టానం ఆయనకు స్పష్టమైన సంకేతాలు ఇవ్వకపోవడంతోనే ఆలస్యమవుతుందని కొందరు చెబుతుండగా, ఇంద్రకరణ్‌రెడ్డి తన ఉద్దేశపూర్వకంగానే చేరిక విషయంలో ఆలస్యం చేస్తున్నారంటూ మరికొంతమంది వ్యాఖ్యానిస్తున్నారు. కాగా స్థానికంగా ఎదురవుతున్న వ్యతిరేకతపై పార్టీ అధిష్టానం సీనియర్ నేతలతో చర్చించివారిని ఒప్పించే ప్రయత్నం చేస్తున్నట్లు కూడా పలువురు పేర్కొంటున్నారు. ఇంద్రకరణ్‌రెడ్డి కాంగ్రెస్ పార్టీలో చేరినట్లయితే నిర్మల్ జిల్లాలో బీఆర్ఎస్‌కు బిగ్ షాక్ తగిలినట్లేనంటున్నారు. ఇక్కడ ఆ పార్టీకి కనీసస్థాయిలో నాయకుడే లేకుండా పోతారని పలువురు అభిప్రాయపడుతున్నారు.



అల్లోల చేరికపై డైలామా..

బీఆర్ఎస్ మాజీ మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి కాంగ్రెస్ పార్టీలోచేరే వ్యవహారం ఆసక్తిని రేకెత్తిస్తోంది. ఆయన చేరికపై డైలామా కొనసాగుతున్నందున ఇటు బీఆర్ఎస్ లోనూ అటు కాంగ్రెస్‌లోనూ తీవ్ర ఉత్కంఠ నెలకొంటోంది. ఇంద్రకరణ్‌రెడ్డికి సన్నిహితుడిగా, అనుచరునిగా కొనసాగుతున్న ముథోల్ మాజీ ఎమ్మెల్యే విఠల్ రెడ్డి అనూహ్యంగా గురువారం కాంగ్రెస్ పార్టీలో చేరడంతో ఇక్కడి బీఆర్ఎస్ పార్టీ వర్గాలు ఆశ్చర్యానికి గురయ్యాయి. విఠల్ రెడ్డి మాజీ మంత్రి ఇంద్రకరణ్ రెడ్డితో కలిసి కాంగ్రెస్‌లో చేరనున్నారన్న ప్రచారం మొదట్లో జరిగింది. అయితే దీనికి విరుద్ధంగా విఠల్‌రెడ్డి మాజీ మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి లేకుండానే ఒంటరిగా కాంగ్రెస్‌పార్టీలో చేరడం ఆసక్తికరంగా మారుతోంది. విఠల్ రెడ్డి చేరికను మొదట్లో మాజీ ఎమ్మెల్యేనారాయణ రావు పటేల్ వ్యతిరేకించినట్లు సమాచారం. ఆయన ద్వారా వ్యతిరేకత ఎదురుకాకుండా చేసుకునేందుకే విఠల్‌రెడ్డి గుట్టు చప్పుడు కాకుండా కాంగ్రెస్ చేరినట్లు చెబుతున్నారు. అయితే నిర్మల్ నియోజకవర్గంలో మాజీ మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి చేరికను కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. దీనికారణంగానే అధిష్టానం ఇప్పటి వరకు పార్టీలో చేరికపై ఆయనకు గ్రీన్‌సిగ్నల్ ఇవ్వలేదని అంటున్నారు. ఇంద్రకరణ్‌రెడ్డి చేరిక విషయమై పార్టీనేతలు, కేడర్‌కు నచ్చజెప్పే ప్రయత్నాలు చేసే అవకాశం ఉందని ప్రచారం జరుగుతోంది. పార్టీలో సీనియర్ నేతల, మాజీ మంత్రి అల్లోల ఇంద్రకరణ్ రెడ్డికి సన్నిహితులుగా కొనసాగిన జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఎర్రవోతు రాజేందర్, నిర్మల్ ఎంపీపీ రామేశ్వర్ రెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్ అప్పాల గణేష్ చక్రవర్తి, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ నేరేళ్ల వేణు తదితరులంతా ఆయనతో సంబంధం లేకుండానే పార్టీకి రాజీనామా చేయడమే కాకుండా కాంగ్రెస్‌పార్టీలో చేరడం ప్రాధాన్యతను సంతరించుకుంటోంది. పరిస్థితులు ఇలాగే కొనసాగితే బీఆర్ఎస్ పార్టీ నుంచి కాంగ్రెస్ పార్టీలోకి వలసల పర్వం ఉధృతం కానుందని, దీని కారణంగా బీఆర్ఎస్ ఖాళీ అయ్యే పరిస్థితులు నెలకొన్నాయంటున్నారు.

మారనున్న సమీకరణాలు

మాజీ గ్రంథాలయ సంస్థచైర్మన్ ఎర్రవోతు రాజేందర్, మాజీ మున్సిపల్ చైర్మన్ అప్పాల గణేష్‌తోపాటు పలువురు కౌన్సిలర్‌లు బీఆర్ఎస్‌కు రాజీనామా చేసి కాంగ్రెస్ పార్టీలో చేరడంతో జిల్లాకేంద్రమైన నిర్మల్ పట్టణ రాజకీయాలు తలకిందులు కానున్నాయంటున్నారు. ముఖ్యంగా మొన్నటి అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ ఇక్కడ మెజార్టీ ఓట్లను సాధించింది. బీఆర్ఎస్ రెండోస్థానంలో నిలవగా కాంగ్రెస్‌పార్టీ మూడోస్థానంలో నిలిచింది. అయితే ఈసారి కాంగ్రెస్‌పార్టీ నిర్మల్ పట్టణంపై దృష్టిపెట్టింది. పట్టణంలో పట్టున్న మాజీ మున్సిపల్ చైర్మన్ గణేష్ చక్రవర్తి, మాజీ గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఎర్రవోతు రాజేందర్‌లు కాంగ్రెస్ పార్టీలో చేరడం అలాగే పలువురు మైనార్టీ కౌన్సిలర్లు సైతం బీఆర్ఎస్ పార్టీకి రాజీనామాచేసి కాంగ్రెస్ పార్టీలో చేరిన కారణంగా ఈసారి పట్టణ ఓట్లను ఎక్కువగా సాధిస్తామన్న ధీమాలో ఆ పార్టీ ఉంది. వీరితో పాటు బీఆర్ఎస్ కౌన్సిలర్‌లు చాలామంది కాంగ్రెస్‌లో చేరడంతో పట్టణ సమీకరణలు తలకిందులు కానున్నాయి. వీరితోపాటు బీఆర్ఎస్ ఫ్లోర్‌లీడర్ కాంగ్రెస్‌లో చేరారు. రాబోయే ఎన్నికల్లో మెజార్టీ ఓట్లను సాధించడమే లక్ష్యంగా కాంగ్రెస్ ముందుకు సాగుతోంది.



కేక్ కట్ చేసి సంబరాలు నిర్వహిస్తున్న నాయకులు

ఔషధాల ధరలు తగ్గించి జీఎస్టీని ఎత్తి వేయాలి

- టీఎంఆర్ఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జి.విద్యాసాగర్

నిర్మల్‌టౌన్, మార్చి24: ఔషధాల ధరలు తగ్గించి, జీఎస్టీని ఎత్తివేసి, ఫార్మారంగంలోని ఔషధధరలను తగ్గించాలని తెలంగాణ మెడికల్ అండ్ సేల్స్ రిప్రెసెంటెడ్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జి.విద్యాసాగర్ అన్నారు. ఆదివారం టీఎంఆర్ఎస్‌యూ నిర్మల్ జిల్లా శాఖ ఆవిర్భావసభ సీఐటీయూ జిల్లా కార్యాలయంలో కేక్‌ను కట్ చేసి సంబరాలు నిర్వహించుకున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రాష్ట్ర ఉపాధ్యక్షుడుజి. విద్యాసాగర్, ఐఎంఏ జిల్లాఅధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ రామకృష్ణ, డాక్టర్ సంతోష్, సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి బొమ్మెన సురేష్‌లు హాజరయ్యారు. ఈ సందర్భంగా జి. విద్యాసాగర్ మాట్లాడుతూ మెడికల్ సేల్స్ రిప్రజెంటేటివ్ యూనియన్ దేశభక్తి గత 60 ఏళ్ల నుంచి సేల్స్ ప్రొడక్ట్ ఎంప్లాయిమెంట్ యూనియన్‌గా ప్రజలకు సంబంధించిన నకిలీ నాసిరకం మందులను అరికట్టాలని, మందులపై జీఎస్టీని ఎత్తివేయాలని, ఆన్‌లైన్ మందుల అమ్మకాలను నిషేధించాలని, ప్రభుత్వరంగా ఫార్మాకంపెనీలను పునరుద్ధరించాలని సమాజహితం కోసం అనేక కార్యక్రమాలను చేపడుతున్నామని అన్నారు. కార్యక్రమంలో తదితరులు పాల్గొన్నారు.



వేడుకల .ముగింపు పూజలను నిర్వహిస్తున్న పండితులు

భైంసాలో ముగిసిన బ్రహ్మోత్సవాలు

భైంసా, మార్చి24: పట్టణంలోని శ్రీ లక్ష్మీవెంకటేశ్వర స్వామి ఆలయంలో సోమవారం ప్రారంభమై 18వ వార్షిక శ్రీవారి బ్రహ్మోత్సవాలు ముగిశాయి. శనివారం రాత్రివేళలో నిర్వహించిన పుష్ప యాగం, ప్రణయ కలహోత్సవం, ఏకాంత సేవ, రుత్విక్ సన్మానం మహాకుంభ ప్రోక్షణ, మహాదాశీర్వచన కార్యక్రమాను ఘనంగా నిర్వహించారు. ఆదివారం ఉదయం వేళలో ఆలయ పండితులు ముగింపు పూజలు నిర్వహించారు. పట్టణ పరిధిలోని భక్తులతో పాటు సమీప ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. పుష్కర బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని ఆరురోజుల పాటు రాత్రి వేళలో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను విశేషంగా అలరారించాయి. వివిధ విద్యా సంస్థలకు చెందిన విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక ప్రదర్శనలు వేడుకలకు మరింత వన్నె తెచ్చిపెట్టాయి.



వేడుకల్లో పాల్గొన్న భక్తులు



ఆలూర్‌లో హోలీ ఆడుతున్న గ్రామస్థులు

పలుచోట్ల హోలీ సంబరాలు

సారంగాపూర్, మార్చి24: మండలంలో గల కౌట్ల(బి), ఆలూర్, బీరవెల్లి గ్రామాల్లో ఆదివారం హోలీ సంబరాలు జరుపుకున్నారు. ఈ నేపథ్యంలో ఆలూర్‌లో డప్పుమేళాల మధ్య వీధుల్లో తిరుగుతూ ఒకరిపై ఒకరు రంగులను చల్లుకొని హోలీ పండగ శుభాకాంక్షలు తెలిపారు. దీంతోపాటు ముస్లింలు హిందూవులకు హోలీ పండుగ శుభాకాంక్షలు తెలిపారు.



కల్లూర్ కస్తుర్బా పాఠశాలలో హోలీ సంబరాల్లో విద్యార్థినులు, ఉపాధ్యాయులు

- కస్తూర్బాలో..

కుంటాల: మండలంలోని కల్లూరు కస్తూర్బా గాంధీ గురుకుల పాఠశాలలో ఆదివారం ముందస్తు హోలీ పండుగను జరుపుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థినిలు ఒకరినొకరు రంగులు చల్లుకొని హోలీ పండుగ శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు. వీరితోపాటు పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మానిటరింగ్ కమిటీ సభ్యుడిగా ముఖిముద్దీన్ నియామకం

నిర్మల్ కల్చరల్, మార్చి24: నిర్మల్ జిల్లా మీడియా సర్టిఫికేషన్, మానిటరింగ్ కమిటీ సభ్యుడిగా సీనియర్ ఉర్దూ జర్నలిస్ట్ మొహమ్మద్ ముఖిముద్దీన్ నియమితులయ్యారు. భారత ఎన్నికల సంఘం ఆదేశానుసారం ఆయనను నియమిస్తూ కలెక్టర్ ఉత్తర్వులు జారీచేశారు. ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థుల ఖర్చుల వివరాలు కమిటీ పరిశీలించనుంది. ఈ కమిటీకి కలెక్టర్ చైర్మన్‌గా, డీపీఆర్‌వో కార్యదర్శిగా వ్యవహరిస్తారు. నిర్మల్ పాత్రికేయులు ఆయన నియామకం పట్ల హర్షం వ్యక్తం చేశారు.



ఉత్సవాలు ప్రారంభించి పూజలు చేస్తున్న దృశ్యం

ఘనంగా రేణుక ఎల్లమ్మ విగ్రహ ప్రతిష్ఠాపన ఉత్సవాలు

నిర్మల్‌రూరల్, మార్చి24: నిర్మల్ గీత పారిశ్రామిక సహకార సంఘం, గౌడ సంఘం ఆధ్వర్యంలో నిర్మల్ సమీపంలోని అక్కాపూర్ గ్రామంలో నిర్మిస్తున్న శ్రీశ్రీశ్రీ రేణుక ఎల్లమ్మ మాత విగ్రహ ప్రతిష్ఠాపన ఉత్సవాలు ఆదివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. గురువారం వరకు కొనసాగే ఈ 5రోజుల కార్యక్రమంలో భారీఎత్తున గౌడ కులస్థులు పాల్గొంటున్నారు. దైవాజ్ఞ గురుమంచు చంద్రశేఖర శర్మ ఆధ్వర్యంలో వేద పండితులు విద్యాసాగర్ శాస్త్రి, శివరామకృష్ణ, వినోద్ కుమార్ సహా తిరుపతి, బీదర్, అచ్చులాపూర్ తదితర ప్రాంతాల నుంచి వచ్చిన వేదపండితులు ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. పరిసర గ్రామాల నుంచి భక్తులు పెద్దఎత్తున తరలివచ్చారు. కార్యక్రమంలో గౌడ సంఘం ప్రతినిధులు లింగాగౌడ్, జీవన్ గౌడ్, డాక్టర్ రమణాగౌడ్, రాజుగౌడ్, దేవేందర్‌గౌడ్, వేణుగోపాల్ గౌడ్, కృష్ణమోహన్ గౌడ్, రవీందర్ గౌడ్, నర్సాగౌడ్, శ్రీనివాస్‌గౌడ్, గంగాధర్‌గౌడ్, దశగౌడ్, నర్సాగౌడ్, తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక ఇబ్బందులతో యువకుడి ఆత్మహత్య

దిలావర్‌పూర్, మార్చి24: ఒకవైపు ఆర్థిక ఇబ్బందులు, మరోవైపు అనారోగ్యంతో సమస్యలతో సతమతమైన ఓ యువకుడు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై సుమాంజలి తెలిపారు. మండల కేంద్రానికి చెందిన బెజ్జారం నరేష్ (36) డ్రైవర్‌గా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. అయితే కొంత అప్పు చేసి సొంతంగా కారు కొనుగోలు చేసి స్వయం ఉపాధి పొందుతున్న నేపథ్యంలో తాగుడుకు బానిసయ్యాడు. అప్పు ఇచ్చిన వారు కారును తీసుకెళ్లడంతో తీవ్ర మనస్తాపం చెందిన నరేష్ ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు చీరతో ఉరేసుకొని మృతి చెందాడు. ఈ మేరకు కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై సుమాంజలి తెలిపారు.



భైంసా మార్కెట్‌లో జరుగుతున్న రంగుల కొనుగోళ్లు

మార్కెట్‌కు హోలీ శోభ

భైంసా, మార్చి24: పట్టణ మార్కెట్ హోలీ పర్వదిన శోభను సంతరించుకుంది. సోమవారం నిర్వహించుకునే హోలీ పర్వదిన నిర్వాహణ కోసం రంగులతోపాటు ఇతర సామగ్రి కొనుగోళ్లు జరుపడంతో మార్కెట్‌లో సందడి నెలకొంది. స్థానిక ప్రధానరోడ్డు మార్గంలో 15కు పైగా రంగుల విక్రయ కేంద్రాలు, కుడుకలు, చక్కెర బిళ్లల దండల విక్రయ కేంద్రాల వెలిశాయి. అధికశాతం మంది రంగులతో పాటు వాటిని చల్లేందుకు వినియోగించే పిచికారీలు, పర్వదినం రోజున వినియోగించే కుడుకలు, చక్కెర బిళ్లల దండలను ముమ్మరంగా కొనుగోలు చేశారు. విక్రయ కేంద్రాలు కొనుగోలుదారులతో సందడిగా కనిపించాయి. ఇక్కడి ప్రాంతంలో హోలీ పర్వదినాన్ని వయస్సుతో నిమిత్తం లేకుండా అన్ని వయస్సులకు చెందిన యువతీ, యువకులు ఆనందోత్సహాల మధ్య ఘనంగా జరుపుకోవడం ఆనవాయితీగా వస్తోంది.

నేడు హరిహర క్షేత్రంలో పంచామృతాభిషేకం

నిర్మల్ కల్చరల్, మార్చి24: నిర్మల్‌లోని హరిహర క్షేత్రంలో అయ్యప్ప స్వామి జన్మదినం సందర్భంగా సోమవారం పంచామృతాభిషేకం, నూతన వస్త్రాలంకరణ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఆలయ ధర్మకర్తలు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై తీర్థప్రసాదాలు స్వీకరించాలని కోరారు.

జిల్లా నూతన కార్యవర్గం ఎన్నిక

నిర్మల్‌టౌన్, మార్చి24: టీఎంఆర్ఎస్‌యూ నూతన్ కార్యవర్గాన్ని ఆదివారం సీఐటీయూ జిల్లా కార్యాలయంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా బి. ప్రవీణ్ కుమార్, జిల్లా ప్రధాన కార్యదర్శిగా జి. రాజశేఖర్, జిల్లా ఆఫీస్ బేరర్స్ ప్రమోద్, శ్రావణ్, సందీప్, విజయ్ కాంత్, జిల్లా కమిటీ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

టీఎంఆర్ఎస్‌యూ జిల్లా నూతన కార్యవర్గం ఎన్నిక

నిర్మల్‌టౌన్, మార్చి24: టీఎంఆర్ఎస్‌యూ నూతన్ కార్యవర్గాన్ని ఆదివారం సీఐటీయూ జిల్లా కార్యాలయంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా బి.ప్రవీణ్ కుమార్, జిల్లా ప్రధాన కార్యదర్శిగా జి.రాజశేఖర్, జిల్లా ఆఫీస్ బేరర్స్ ప్రమోద్, శ్రావణ్, సందీప్, విజయ్ కాంత్, జిల్లా కమిటీ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

కాంగ్రెస్ పార్టీలో చేరిన ట్రస్మా అధ్యక్షుడు



కాంగ్రెస్‌లోకి ఆహ్వానిస్తున్న మంత్రి సీతక్క

నిర్మల్ కల్చరల్, మార్చి 24: నిర్మల్ జిల్లా ట్రస్మా అధ్యక్షుడు గొల్లపల్లి శ్రీనివాస్‌గౌడ్ ఆదివారం మంత్రి సీతక్క సమక్షంలో అధికార కాంగ్రెస్ పార్టీలో చేరారు. పార్టీ కండువా కప్పి మంత్రి కాంగ్రెస్‌లోకి ఆహ్వానించారు. రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి గెలుపు కోసం కృషి చేయాలని అన్నారు. ఆయనతో పాటు మాజీ ఎంపీపీ అయిండ్ల పోశెట్టి, మంజులాపూర్ మాజీ సర్పంచ్ నరేష్ కాంగ్రెస్ పార్టీలో చేరిన వారిలో ఉన్నారు. జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కే.శ్రీహరిరావు, జడ్పీటీసీ పత్తిరెడ్డి రాజేశ్వర్‌రెడ్డి, మాజీ గ్రంథాలయ చైర్మన్ ఎర్రవోతు రాజేందర్ పాల్గొన్నారు.

బీఆర్ఎస్ పార్టీకి సీనియర్ కార్యకర్త రాజీనామా

నిర్మల్ కల్చరల్, మార్చి24: బీఆర్ఎస్ పార్టీకి చెందిన సీనియర్ కార్యకర్త నిర్మల్ జిల్లాకు చెందిన సోమేశ్వర్ పార్టీకి రాజీనామా చేసినట్లు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. 16ఏళ్ల పాటు వ్యాపారం సైతం వదులుకొని తెలంగాణ ఉద్యమంలో క్రియాశీలకంగా పని చేశానని పేర్కొన్నారు. తనకు న్యాయం జరుగలేదని మనస్థాపం చెంది రాజీనామా చేస్తున్నట్లు తెలిపారు. తన రాజీనామా ఆమోదించాలని పార్టీ అధ్యక్షుడు కేసీఆర్‌ను కోరారు.

ప్రతిభ కనబరిచిన కండక్టర్, డ్రైవర్లకు ప్రశంసాపత్రాలు



ప్రశంసా పత్రాలతో ప్రతిభ కనబరిచిన కండక్టర్లు, డ్రైవర్లు

నిర్మల్ టౌన్, మార్చి24: ఆర్టీసీ నిర్మల్ డిపోలో డిపో మేనేజర్ ప్రతిమారెడ్డి ఆధ్వర్యంలో విధుల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన కండక్టర్, డ్రైవర్లకు ప్రశంసాపత్రాలతోపాటు నగదును రీజినల్ మేనేజర్ సాలోమన్ ఆదివారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డీజిల్ ఆదా చేసిన డ్రైవర్లు, డిపోకు అత్యధిక ఆదాయం తీసుకువచ్చి కండక్టర్లను అభినందించడం సంతోషంగా ఉందన్నారు. ఏప్రిల్ నెల కీలకమని, పెళ్లిళ్లు ఉన్నందున ప్రయాణికుల రద్దీ పెరుగుతున్నందున చాలా బస్సులు తిప్పివలసి ఉంటుందని అన్నారు. మంచి విశ్రాంతి తీసుకుని మంచి ఆహారం తీసుకుని విధులను నిర్వహించాలన్నారు. ఎండల తీవ్రతను తట్టుకునేందుకు సూచనలను పాటించాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ ఆర్ఎంవో ప్రణీత్, డిప్యూటీ ఆర్ఎం ఎం. ప్రవీణ్ కుమార్, డిపో మేనేజర్ ప్రతిమా రెడ్డి, అసిస్టెంట్ మేనేజర్ ఐ. రాజశేఖర్, అసిస్టెంట్ ఇంజనీర్ ఎం. నవీన్ కుమార్ ఉద్యోగులు పాల్గొన్నారు.